క్లుప్తంగా

వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం


రథంలో ఊరేగుతున్న చెన్నకేశవస్వామి

గూడూరు: చెన్నకేశవస్వామి రథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. స్థానిక కరణాల వీధిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్ల రథోత్సవం జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని రథంలో కొలువు దీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. ఈ రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శరవేగంగా జగనన్న లేఅవుట్లలో వసతులు


తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయిస్తున్న ఉప సర్పంచి రాజశేఖర్‌రెడ్డి

వాకాడు: పేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు, అభివృద్ధి పనులు మండలంలో శరవేగంగా జరుగుతున్నాయి. వాకాడులో గ్రామ ఉప సర్పంచి పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు.

భగవద్గీతపై ప్రచారం


ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

రాపూరు: మండలంలోని గుండవోలు, అకిలివలస, ఓబులాయిపల్లె గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞాన గ్రంథాలపై ప్రచారం నిర్వహించినట్లు ఆ సిద్ధాతం, ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు పెంచలనరసయ్య తెలిపారు. జీవాత్మ, పరమాత్మ, ఆత్మ అనే మూడు ఆత్మల వివరం తెలుసుకోవడంతో ధర్మాల స్థాపన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణయ్య, పెంచలయ్య, కిషోర్, గాయత్రి, కొండయ్య, కార్తీక్, కిరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి దారి లేక ఇక్కట్లు


దుస్థితిలో శ్మశాన రోడ్డు

దొరవారిసత్రం: తీర గ్రామమైన మీజూరు ఎస్సీ కాలనీ వాసులకు శ్మశానికి దారి లేకపోడంతో మృత దేహాలను ఖననం చేయాలంటే ఇక్కట్లు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీకి చెందిన శ్మశానానికి వాగు దాటుకుని పంట పొలాలు మీదుగా సుమారు కిలోమీటరు దూరం వెళ్లాల్సి ఉంది. వర్షం కాలంలో అయితే శ్మశానానికి వెళ్లే మార్గం అంతా ఓవైపు వర్షం నీటితో మునిగిపోతుంది. మరో వైపు పొలాల్లో పంటలు సాగు చేస్తారు. దీంతో మృతదేహాల ఖననానికి ఆ కాలనీ వాసులు పడే ఇబ్బందులు వర్ణణాతీతం. సంబంధిత అధికారులు స్పందించి శ్మశానానికి సరైన రోడ్డు వసతి కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం


కంటైనర్‌ను పట్టుకుని మోటార్‌సైకిల్‌పై వెళుతున్న యువకుడు

గూడూరు: జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై ప్రయాణం అంటేనే సాహసంగా మారిన ఈ రోజుల్లో వేగంగా వెళుతున్న కంటైనర్‌ను పట్టుకుని మోటార్ సైకిల్‌పై వెళ్లడం అంటే.. ప్రాణాలతో చెలగాటమే. గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై పోటుపాళెం కూడలి సమీపంలో ఈ దృశ్యాన్ని చూసి...అయ్యో ఎంత సాహసం చేస్తున్నాడా యువకుడు అనని వారేలేరు. పెట్రోలు అంతలా పెరిగిపోతే మాత్రం.. ఇంత సాహసం చేయాలా..ప్చ్‌ప్చ్.. అంటూ వెనుక వెళుతున్న వాహనచోదకులు పెదవి విరిచారు.

‘రైతు(కు)భరోసా’ కేంద్రం

కష్టాల సేద్యం నుంచి కర్షకులను గట్టెక్కించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఆపదలో ఉన్న అన్నదాతలకు అండగా నిలవాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తలిచారు. రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పుడమి పుత్రుల ముంగిటకే అన్ని సేవలు తెచ్చారు. రైతుకు భరోసా కల్పించారు.

- ప్రారంభానికి ముస్తాబవుతున్న ఆర్బీకేలు
- అన్నదాతకు అందుబాటులో సేవలు


చిలమానుచేనులో నిర్మించిన రైతుభరోసాకేంద్రం

ఓజిలి: వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపించేందుకు ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. ఇప్పటికే నేనున్నాంటూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కర్షకులకు అన్నిరకాల సేవలు, సాగుకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది.

విస్తృతం కానున్న సేవలు

ఆర్బీకేల ద్వారా మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన కేంద్రాలు నుంచి నిపుణులు, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు. ఈ కేంద్రాలు ద్వారానే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, పురుగు మందులు అందజేస్తారు. రైతులకు సాగులో పెట్టుబడులు తగ్గించి, ఆదాయం పెరిగే ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లనున్నారు. ప్రకృతి వ్యవసాయంలోని బీజామృతం, పంచగవ్యం, ఘనజీవామృతం తదితర కషాయాలను తయారు చేయడాన్ని రైతులకు నేర్పిస్తారు.

కేంద్రాల్లో ఆన్‌లైన్ సేవలు

రైతు భరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. పొలంబడి ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేయనున్నారు. వివిధ ప్రాంతాల్లో సాగుచేసే విత్తనాల నమూనాలను ఉంచుతారు. ఆన్‌లైన్ సేవలకు కంప్యూటర్ స్కీన్‌లను ఏర్పాటు చే స్తారు. రైతులకు అవసరమయ్యే సామగ్రి, వ్యవసాయానికి సంబంధించిన దినపత్రికలు, వార, పక్ష పత్రికలు అందుబాటులో ఉంచుతారు. ఇంటర్నెట్ ద్వారా రైతులకు ఆధునిక పద్ధతులను తెలియజేస్తారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న కేంద్రాలు

ఓజిలి మండలంలో పది సచివాలయాల పరిధిలో పది రైతుభరోసాకేంద్రాలు నిర్మించేలా అధికారుల ప్రణాళికలు తయారు చేశారు. అత్తివరం, మాచవరం, ఆర్మేనిపాడు, చిలమానుచేను, కర్రబల్లవోలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. పనులన్నీ పూర్తి అయ్యాయి. కురుగొండ, ఓజిలి, ఇనుగుంట, గ్రద్ధగుంట, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో కేంద్రాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి అయితే గ్రామాల్లో వ్యవసాయాధికారులు సేవలు విస్తృతం కానున్నాయి.

రైతులకు ప్రాధాన్యం



ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. ఎన్నికల హామీలను నెరవేర్చుతూ రైతులకు అండగా నిలుస్తోంది. రైతులకు పెట్టుబడి సాయం, వరి మద్దతు ధర, రైతు భరోసా కేంద్రాలను రైతుల ముంగిటకే తీసుకొచ్చింది.

- జమళ్ల రవి, రైతు, కొండవల్లిపాడు

గొప్ప పరిణామం



రైతులకు సాగు విషయాలను స్థానికంగా అందించడం గొప్ప పరిణామం. ఈ కేంద్రాలు ద్వారా పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందించడం గొప్ప విషయం. అధికారులందరూ ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ రైతులకు సూచనలు, సలహాలు ఇస్తారు.

-కే రవి, జిల్లా కార్యదర్శి,వైఎస్సార్‌సీపీ రైతు విభాగం

కేంద్రాల ఏర్పాటుకు సర్వం సిద్ధం



రైతుభరోసాకేంద్రాలు ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నాం. శాశ్వత భవనాలు పూర్తికావచ్చాయి. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు సలహాలు అందిస్తారు.

- విజయలక్ష్మి, వ్యవసాయాధికారి, ఓజిలి

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక హోమాలు


హోమంలో పాల్గొన్న ఆర్యవైశ్య దంపతులు

రాపూరు: మండలకేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య దంపతులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా అమ్మవారికి కుంభాభిషేకం నిర్వహింస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొలు మధుసూదన్‌రావు, అర్చకులు రామనాధేశ్వరశర్మ తెలిపారు. వారు మాట్లాడుతూ కుంభాభిషేకంలో భాగంగా ఉదయం గణపతి, నవగ్రహ, ఉపదేవతలకు మూలమంత్రహోమాలు నిర్వహించినట్లు చెప్పారు. సోమవారం ఆలయంలో చండిహోమం, పూర్ణహుతి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్య దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

‘మా నాన్న స్ఫూర్తితోనే ముందుకెళుతున్నాం’


సీఆర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న రోహిణి తదితరులు

గూడూరు: పేదల ప్రజలకు మన వంతుగా వైద్య సాయం అందించాలని, చిన్న వయస్సు నుంచి తమకు నాన్న చెప్పేవారని, ఈ క్రమంలోనే తామూ ఆ దిశగా ముందుకెళుతున్నామని ప్రముఖ వైద్యురాలు రోహిణి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సాయిబాబా మందిరంలో మందిర కమిటీ ఆధ్వర్యంలో సీఆర్‌రెడ్డి సంతాపసభ నిర్వహించారు. సీఆర్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రోహిణి, అల్లుడు డాక్టర్ జనార్దన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై సీఆర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ చిన్న వయస్సు నుంచే నాన్న వైద్యవృత్తిలో నిబద్ధతతో ఎలా ఉండాలో నేర్పారన్నారు. ఆయన స్ఫూర్తితోనే పేదల ప్రజలకు తమ వంతు వైద్య సేవలందజేయడమే కాకుండా, సామాజిక సేవలోనూ తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. అనంతరం ప్రముఖ ఆడిటర్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ జనార్దన్‌రెడ్డి దంపతులు గత కొన్నేళ్లుగా బాబా మందిరంలో పేదలకు ఉచితంగా వైద్య సేవలందజేయడమేకాకుండా, వారికి ఉచితంగా మందులు, తిరిగి వెళ్లేందుకు అవసరమైన ఖర్చులు కూడా ఇస్తుండడం అభినందనీయమన్నారు. డాక్టర్ సీఆర్‌రెడ్డి లేని లోటును కుమార్తె, అల్లుడు తీర్చుతారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవీ కృష్ణయ్య, కోటి, శ్రీధర్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రహదారి ఆనుకుని ఉన్న కాండం తొర్రపోయిన చెట్టు, (ఇన్‌సెట్) దెబ్బతిన్న కాండం

గూడూరు అది గూడూరు- తిరుపతి, రాపూరు ప్రాంతాలకు వెళ్లే రహదారి.. ఆ దారిని ఆనుకునే పెద్ద వృక్షం. ఆ చెట్టు కూలిపోయే స్థితిలో ఉంది. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి. ఆ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి. ఈ క్రమంలో ఆ మార్గం మీదుగా వెళ్లేవారు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. గూడూరు రూరల్ పరిధిలోని తిప్పవరప్పాడు గ్రామానికి సమీపంలో రహదారిని ఆనుకుని పెద్ద చెట్టు లోపలి ప్రాంతమంతా కాలిపోయి కేవలం బెరడు మీదనే ఆధారపడి ఉంది. అది పెద్ద చెట్టు కావడంతో పైన కొమ్మల భారం కూడా ఎక్కువగానే ఉంది. గాలులు వీస్తే ఆ చెట్టు పడిపోయే పరిస్థితి నెలకొని ఉంది. ఆ చెట్టును ఆనుకునే రహదారి ఉండడంతో ఏదైనా వాహనాలు గానీ, పాదచారులు గానీ వెళ్లే సమయంలో కూలితే వారి ప్రాణాలు హరీ అనాల్సిందే. ఆ చెట్టును తొలగించి ఎవరికీ ప్రమాదం జరుగకుండా చూడాలని ప్రయాణికులు, వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

10న సైదాపురం మండల మీట్

సైదాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ బుధవారం ఎంపీపీ పలుగొటి పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తప్పిసరిగా పాల్గొనాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. ఇద్దరికి గాయాలు

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయరహదారి మార్గంలో గుర్రప్పతోట గ్రామం వద్ద ఆదివారం రాత్రి ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ఘటనలో ప్రభాస్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన ప్రభాస్ అనే యువకుడు తన స్నేహితుడితో కలసి నాయుడుపేట నుంచి తిరుపతికి బైక్‌లో వెళుతున్నాడు. మార్గ మధ్యంలో గుర్రప్పతోట గ్రామం వద్ద తిరుపతి నుంచి నెల్లూరుకు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ప్రభాస్‌కు తీవ్ర గాయాలు కాగా, అతడి స్నేహితుడికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో ప్రభాస్‌ను స్థానికులు 108 వాహనంలో నాయుడుపేటకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫల సరుకుల పంపిణీ

గూడూరు: దివ్యాంగులకు ఆదివారం దాతలు ఫల సరుకులు పంపిణీ చేశారు. డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి సతీమణి ఇంద్రసేనమ్మ దాతృత్వంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫలసరుకులను డాక్టర్లు సుధీర్‌రెడ్డి, సాయి శరత్‌రెడ్డి, ప్రియాంకరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, బండి ధనుంజయరెడ్డి, జైపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డు


వేలికాడు సమీపంలో దెబ్బతిన్న రోడ్డు

దొరవారిసత్రం: తీర గ్రామాలైన కారికాడు, వేలికాడు, నాగినేరి, మీజూరు గ్రామాల్లో సుమారు 16 కిలోమీటర్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు ఇరువైపులా కోతకు గురైంది. తారు రోడ్డు దెబ్బతినడంతో రాత్రి వేళల్లో వాహనచోదకులు అజాగ్రత్తగా వాహనాలు నడిపితే మాత్రం ప్రమాదం తప్పదని తీర గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మీజూరు సమీపంలో అడుగడుగున రోడ్డుకు ఇరువైపులా దెబ్బతింది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

స్టీల్ ప్లేట్ల వితరణ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బీఎంఆర్ నగర్ సమీపంలో ఉన్న చేయూత అనాథ ఆశ్రమంలోని పిల్లలకు ఆదివారం వై ప్రభాకర్‌రావు జ్ఞాపకార్థం స్టీల్ ప్లేట్లు వితరణ చేశారు. పిల్లలకు భోజన వసతి ఏర్పాటు చేశారు. అలాగే ప్రభాకర్‌రావు సతీమణి విశ్రాంత అధ్యాపకురాలు పెంచలమ్మ, ఆమె కుమారులు బాలాజీ కిరణ్, మంజీర్ సృజన్ కుటుంబ సభ్యులు పలు సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తుపాన్ షెల్టర్లు


దుస్థితిలో ఉన్న కారికాడు తుపాన్ షెల్టర్

దొరవారిసత్రం: విపత్తుల నుంచి తీర గ్రామాల్లోని ప్రజలను కాపాడే నిమిత్తం దొరవారిసత్రం మండలంలోని తీర గ్రామాలైన మీజూరు, నాగినేరి, కారికాడు, వేలికాడు గ్రామాల ప్రజల సౌకర్యార్థం కారికాడు, వేలికాడు గ్రామాల్లో రెండు తుపాన్ షెల్టర్లు సుమారు 20 ఏళ్ల కిందట అన్ని సదుపాయలతో నిర్మించారు. ఈ రెండు షెల్టర్లు ఎనిమిదేళ్ల కిందటే శిథిలావస్థకు చేరాయి. వీటి మరమ్మతుల గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ భవనాల కిటికీలు, తలుపులు దెబ్బతిన్నాయి. లోపలి భాగంలో కూడా మెట్లు, గోడలు కొంత వరకు దెబ్బతిని ఉండడంతో విపత్తుల సమయంలో ఈ షెల్టర్లు ప్రజలకు ఉపయోగపడవు. ప్రతి ఏడాది తుపాన్ హెచ్చరికలు వచ్చిన వెంటనే ప్రత్యేకాధికారులు, స్థానిక మండల అధికారులు తీర గ్రామాలను, షెల్టర్లను సందర్శించి వెళ్లడం తప్ప వాటి మరమ్మతులకు ఎవరూ కృషి చేసిన దాఖలాలులేవు. ప్రతిసారీ ఇక్కడకు వచ్చిన అధికారులు మాత్రం తుపాన్ షెల్టర్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం, తుపాన్ షెల్టర్లు మరమ్మతులు చేస్తామని చెప్పడం తప్ప నిధులు మంజూరు కాలేదు. షెల్టర్ల స్థితి మారలేదు. మరమ్మతులు చేపట్టితే కారికాడు, వేలికాడు, నాగినే, మీజూరు గ్రామాల్లోని ప్రజలకు విపత్తుల సమయంలో తుపాన్ షెల్టర్లు ఎంతగానో ఉపయోగపడుతాయని తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా నీట్


విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న పోలీసులు

తడ: మండలంలోని కొండూరు పంచాయతీ పులివేంద్ర గ్రామంలోని పద్మావతి విద్యాలయలో ఆదివారం జరిగిన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు మొత్తం 168 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరు కావడంతో 166 మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5 గంటల వరకు సాగిన పరీక్ష కోసం దూర ప్రాంత విద్యార్థులు కొందరు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం 11 గంటలకే పరీక్ష కేంద్రం వద్దకు వచ్చి వేచి ఉన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జాతీయ రహదారి పక్కనే పరీక్ష కేంద్రం కావడంతోపాటు విద్యార్థులు వచ్చిన కార్లు పెద్ద సంఖ్యలో ఉండడంతో పోలీసులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.


పరీక్ష కేంద్రం వద్ద ఉన్న విద్యార్థులు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

పదిలో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల ప్రతిభ


ద్వితీయ స్థానంలో నిలిచిన మెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థికి స్వీట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిట్టమూరు: పదో తరగతి పరీక్షల్లో మండలంలోని మెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది పరీక్షల్లో 85 శాతం ఫలితాలు సాధించి, మండలంలో ప్రథమస్థానంలో నిలిచారు. పాఠశాల్లో పదో తరగతిలో రేవంత్ సత్య మండల టాపర్‌గా నిలిచాడు. అలాగే డి పరిమల రెండో స్థానం సాధించింది. తొమ్మిది మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. గత మూడేళ్లగా మెట్టు పాఠశాల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరి మన్నన్నలు పొందుతోంది.

ఎస్సీ గురుకులంలో వందశాతం ఉత్తీర్ణత

కోట: పది ఫలితాల్లో కోట మండలంలోని చిట్టేడు ఎస్సీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణులయ్యారు. 42 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా 42 మంది పాసైనట్లు ప్రిన్సిపల్ శుభకర్‌రావు తెలిపారు. ఫస్ట్ క్లాస్ 22, సెకండ్‌క్లాస్ 14, థర్డ్‌క్లాస్‌లో ఇద్దరు ఉత్తీర్ణత సాధించారు.

రాపూరు విద్యార్థుల ప్రతిభ

రాపూరు: పదో తరగతి పరీక్షలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 378 పరీక్షలకు హాజరుకాగా 244 మంది మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల్లో 79 మంది పరీక్షకు హాజరుకాగా 61 మంది ఉత్తీర్ణులయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం రేణుక తెలిపారు. పాఠశాల్లో చదువుతున్న హన్సికా బేగం మండలంలో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. అలాగే బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అవినాష్ ద్వితీయస్థానం, కండలేరు జెడ్పీ పాఠశాలలోని బాలాజీ తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు.

పదిలో మెరిసిన విద్యార్థులు

వాకాడు: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 186 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 116 మంది ఉత్తీర్ణులయ్యారు. వాకాడు బాలయోగి గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. వంశీకృష్ణారెడ్డి మండల టాపర్‌గా నిలిచాడు.

ధర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు మోక్షానికి దిక్సూచికలు



తిరుపతి కల్చరల్: ధర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు మోక్షానికి దిక్సూచికలని, వాటిని ఆచరించి మానవాళి తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని శ్రీవేంకటేశ్వర వేద వర్సిటీ ఉపకులపతి సదాశివమూర్తి తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆవరణలో శనివారం శ్రీరామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలోనూ దేవుడిని చూసి సేవ చేయాలన్నారు. మానవాళికి సేవ చేసేందుకు ప్రతి నాగరిక దేశంలో ఆశ్రమాన్ని ప్రారంభించాలని రామకృష్ణ మిషన్ అధికారులను కోరారు. కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి భీతి హరానందజీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ సేవ చేయడాన్ని అలవర్చుకోవాలని కోరారు. రామకృష్ణ మిషన్ అభివృద్ధిలో శ్రీ శారదా మాత పాత్రపై జి.శ్రీదేవి ఉపన్యసించారు.

అన్నమయ్య గొప్ప సామాజిక వేత్త


మాట్లాడుతున్న శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి

తిరుపతి కల్చరల్: దేవుని దృష్టిలో మనుషులందరూ సమానమేనని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమయ్య గొప్ప సామాజిక వేత్త అని శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాలు ఆదివారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన భూమన్ ‘అన్నమయ్య- సామాజికత’అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య పలు సంకీర్తనల్లో ఆనాటి గ్రామీణ పరిస్థితులు, పాడి పంటలు, సాగునీరు, కుటుంబ సంబంధాలు తదితర అంశాల గురించి తెలియజేశారన్నారు. తాను శ్వేత డైరెక్టర్‌గా పని చేసిన కాలంలో అన్నమయ్య స్ఫూర్తితోనే శ్వేతలో గిరిజన, దళిత, మత్స్యకార తదితర వర్గాల వారికి అర్చక శిక్షణ ప్రారంభించామని గుర్తు చేశారు. బెంగళూరుకు చెందిన ఆచార్య జీఎస్.మోహన్ సదస్సులో ‘అన్నమయ్య -పురందరదాసులు’ అనే అంశంపై ఉపన్యసించారు. ఇద్దరి సంకీర్తనలు జానపద శైలిలో , సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా ఉంటాయన్నారు. విజయవాడకు చెందిన డాక్టర్ రాజ్యలక్ష్మి ‘అన్నమయ్య -దివ్య ప్రబంధములు’ అనే అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం తిరుపతికి చెందిన జి.నాగేశ్వరనాయుడు బృందం నిర్వహించిన సంగీత కచేరి, తిరుపతికి చెందిన జ్యోత్స్న బృందం హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ, తుడా కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.